క్లుప్తంగా


మహిళల ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పులివెందుల రూరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి తాత్కాలిక బెయిల్ మంజూరు కావడంతో పులివెందుల పట్టణంలోని పాత బస్టాండులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హేమలత, ఈశ్వరమ్మ, గౌరి, బేబీ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బడే రాత్ ప్రత్యేక ప్రార్థనలు



విద్యుత్ దీప కాంతులతో మసీదు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా మంగళవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బడే రాత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ రోజు పవిత్ర ఖురాన్ ఉద్భవించిన రోజు అని దాని విశిష్టత గురించి మత గురువులైన మహమ్మద్ సుభేష్ ముల్లావలి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం కుటుంబంలోని సంపదను రెండున్నర శాతం దానం చేయాలని.. దీన్ని జకాత్ అంటారు. అలాగే పిత్రా కుటుంబంలోని ఒక్కొక్కరికి రూ.80లు తగ్గకుండా ఎంతైనా డబ్బులు దానం చేయాలన్నారు.

గండి నిత్యాన్నదాన పథకానికి విరాళం

చక్రాయపేట : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి సతీమణి రాజ్యలక్ష్మి మంగళవారం రూ.50,116ల విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ ముకుందారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.రాఘవేంద్రప్రసాద్, అర్చకులు దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం అందజేశారు.

రంజాన్‌కు ముస్తాబవుతున్న ఈద్గాలు



శానిటేషన్ పనులు చేపడుతున్న నూర్‌బాషా

జమ్మలమడుగు : రంజాన్ సమీపిస్తుండటంతో పట్టణంలోని ఈద్గాలలో మున్సిపల్ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. మంగళవారం పలగాడీ పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీ రాఖాద్రీ ఆధ్వర్యంలో రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న ఈద్గాను, జామియా పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో నవాజ్ కట్టవద్ద ఉన్న ఈద్గాల వద్ద మున్సిపల్ శానిటేషన్ అధికారి నూర్‌బాషా ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు చేపట్టారు.

చదువుకు మించిన ఆస్తి లేదు

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని సెయింట్ జోసెఫ్ బాలుర, బాలికల పాఠశాలతోపాటు ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశమై భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకోవడానికి విద్యార్థులకు ప్రేరణాత్మకమైన సందేశాన్ని ఇచ్చారు. చదువుతోపాటు ఆటలు, పాటలతోపాటు సంగీతం, సాహిత్యంపైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, సీఆర్పీ నాగమణి పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ పాఠశాలలలో అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెట్టడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కార్పొరేట్ పాఠశాలలలో పని చేసే ఉపాధ్యాయులకు అడ్మిషన్ల పేరుతో టార్గెట్‌లు ఇస్తున్నారని తెలిపారు. కొత్త అడ్మిషన్లు చేర్పించకపోతే ఇంక్రిమెంట్‌లు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, విజయ్ పాల్గొన్నారు..

అరటి మొక్కలకు ఈత ఆకులే శ్రీరామరక్ష

పులివెందుల రూరల్ : నల్లగొండువారిపల్లె, కొత్తపల్లె, మల్లికార్జునపురం గ్రామాల్లో అరటి రైతులు తమ సాగు చేసిన అరటి మొక్కలను ఎండ నుంచి రక్షించుకునేందుకు ఈత ఆకులను రక్షణగా వాడుతున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో వేడి నుంచి అరటి మొక్కలు దెబ్బతినకుండా ఉండేందుకు ఈత ఆకులను రక్షణగా ఏర్పాటు చేసుకున్నామని రైతులు వాపోతున్నారు. ఈత ఆకులను అనంతపురం జిల్లా ముదిగుబ్బ ప్రాంతాల నుంచి ఒక మొక్క రూ.2 నుంచి రూ.5లకు కొనుగోలు చేసి తీసుకొచ్చామని రైతులు తెలిపారు. అలాగే వివిధ రకాల జంతువుల భారీ నుంచి కూడా అరటి మొక్కలను రక్షించుకునేందుకు ఈత ఆకులు శ్రీరామరక్షగా పనిచేస్తున్నాయని రైతులు తెలిపారు.



అరటి మొక్కలకు రక్షణగా ఈత ఆకులను ఏర్పాటు చేసుకున్న రైతు, (ఇన్‌సెట్‌లో) మొక్కకు అమర్చిన ఈతాకు

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

సింహాద్రిపురం : మండల పరిధిలోని సుంకేసుల, రావులకొలను, గురిజాల గ్రామాల్లో హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చీనీలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ తోటల్లో ఎక్కువగా వేరుకుళ్లు, బంకు తెగులు సోకుతున్నాయని.. వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేరుకుళ్లు, బంకు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వాడుపట్టిన చీనీ చెట్లకు ఉన్నటువంటి కాయలను పీకి వేసి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులను పిచికారి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో తెగుళ్లు సోకిన చీనీ చెట్లను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ చరణ్, వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.



చీనీ రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి, తదితరులు

ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలి

పులివెందుల రూరల్ : ప్రతి విద్యార్థి బాగా చదువుకుంటే తల ఎత్తుకుని జీవిస్తారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలీసెట్, ఏపీఆర్‌జేసీ సెట్లకు ఉచిత శిక్షణ తరగతులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎంఈఓ వీరారెడ్డి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత శిక్షణకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఎంతో ఉన్నతాశయాలతో ఉచిత శిక్షణ ఇస్తున్న ఉచిత ఉపాధ్యాయ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంఈఓ వీరారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి తర్వాత మొదటిసారి వచ్చే ఈ పోటీ పరీక్షలు చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయ బృందం, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఆఫీసర్ డి.శివకుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గోడౌన్‌లో ఉన్న అగ్నిమాపక యంత్రాలను, పనిముట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతేకాక అగ్నిమాపక సిబ్బందితో విన్యాసాలు చేయించడం జరిగింది. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు 101 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వెంకటసుబ్బయ హరిబాబు, సాలార్, ప్రభాకరరావు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లెలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పులివెందులలో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

పులివెందుల రూరల్ : గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై అప్రమత్తత ఎంతో అవసరమని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి రామకృష్ణ తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వెంటిలేషన్ చేసిన కిటికీలలో ఎలుకలు లోపలికి వెళ్లకుండా జాలరీలు అమర్చుకోవాలని, గోడౌన్ చుట్టూ పక్కల పరిసర ప్రాంతాలో ఎండు గడ్డి, ఎండు ఆకులు లేకుండా ఉంచుకోవాలన్నారు. హెచ్‌పీ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ సంక్షేమపథకాలు అందిస్తున్నారని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి.జంగాలపల్లె గ్రామంలో గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు ఆమె వివరించారు. రానున్న రోజుల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, చిలకల సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, మద్దిలేటిరెడ్డి, కుళాయప్ప, మౌలాలి, నీలయ్య మురళి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమపథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎంపీపీ సావిత్రి

జీవరాసులకు నీటి సౌకర్యం కల్పించండి

జమ్మలమడుగు : ఎండలు తీవ్రంగా ఉండటంతో పాటు పాదాచారులకే కాకుండా పక్షులకు, పశువులకు సైతం ప్రజలు తాగునీరు అందించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే అధికారులు తాగునీటి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజు రోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుంది. ప్రజలకు చల్లటి తాగు నీటిని అందించాలనే సంకల్పం మంచిదన్నారు. అలాగే ఇళ్ల వద్ద పక్షులకు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్‌బాషా, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఆర్డీఓ

ఘనంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

వల్లూరు : మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా సాగింది. వల్లూరులోని బీసీ కాలనీలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అర్హత వుండి ఇంకా ఏవైనా పథకాలు అందడం లేదా అని ఆరా తీశారు. అనంతరం వారి అనుమతితో గృహాల తలుపులకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బాలచంద్ర, పార్టీ నేతలు ప్రవీణ్, కరుణాకర్, చిట్టిబాబు, ఆనంద్, ప్రసాద్, విజయ్, వలంటీర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కిషోర్ కుమార్

‘బీజేపీని ఓడించడమే నిజమైన దేశభక్తి’

పోరుమామిళ్ల : దేశంలో ఏ రాష్ట్రంలో అయినా బీజేపీతో ప్రాంతీయ పార్టీ పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సీపీఎం, సీపీఐ సంయుక్తాధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీతో ప్రాంతీయ పార్టీల పొత్తు ఉరితాడేనన్నారు. నిజమైన దేశభక్తి అంటే బీజేపీని ఓడించడమేనని అభిప్రాయపడ్డారు. పుల్వామా దుర్ఘటనలో 40 మంది సైనికులను పోగొట్టుకున్నామని, అందుకు కేంద్రప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ సభలో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు భైరవప్రసాద్, పిడుగు మస్తాన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడారు. సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బీజేపీని గద్దెను దింపుదామంటూ ప్రచారం

ప్రొద్దుటూరు : స్థానిక నెహ్రూ రోడ్డులో సీపీఐ, సీపీఎం నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెను దింపుదామంటూ మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వారు తెలిపారు. ప్రజలకు వామపక్ష పోరు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, సురేష్, ఓబులేసు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఆయా సచివాలయాల శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బ్యాగులు, డిస్పోజబుల్ గ్లాసులు స్వాధీనం చేసుకుని సంబంధిత దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణదారులు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు రవిశంకర్ రెడ్డి, సుధాకర్‌నాయక్, నాగేంద్రప్రసాద్, గంగయ్య, రమణ, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పాత కలెక్టరేట్‌ను పర్యాటక కేంద్రంగా మార్చాలి

కడప ఎడ్యుకేషన్ : పాత కలెక్టరేట్ కార్యాలయాన్ని పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దాలని పెన్షనర్ల సంఘం అసోసియేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కార్యదర్శి రామమూర్తి నాయుడు కోరారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాత కలెక్టరేట్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వ కాలం నుంచి జిల్లా కేంద్రం కడపలో అత్యంత ప్రతిష్టాత్మక కట్టడమైన పాత కలెక్టరేట్ నేడు కళా విహీనమైందన్నారు. ఒకనాడు అధికారులు, సమస్యలపై వచ్చే ప్రజానీకంతో కళకళలాడే కార్యాలయం నేడు నిరాదరణకు గురవుతోందన్నారు. జిల్లా యంత్రాంగం సుందరమైన ఈ కట్టడాన్ని ఆధునీకరించి ప్రజలకు ఉపయోగపడే ఒక మంచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభిమానులు రాయల్ కరీముల్లా, నాగేష్, నారాయణరెడ్డి, రాముడు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు వాసికి డాక్టరేట్



శివానందలహరిరెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఫాతిమానగర్‌లో నివసించే ఎలిచెర్ల శివానందలహరిరెడ్డికి శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ఎస్కేయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.రఘునాథరెడ్డి పర్యవేక్షణలో ‘బహుళస్థాయి హైబ్రీడ్ ఎన్‌క్రిప్షన్ ఉపయోగించి పటిష్టమైన సమాచార భద్రత, ప్రామాణీకరణను ఏవిధంగా సాధించాలన్న విషయం మీద రోబస్ట్ డేటా, సెక్యూరిటీ అండ్ అథెంటికేషన్ యూజింగ్ మల్టీ లెవల్ హైబ్రీడ్ స్టొగఫీ– యాన్ ఎంపీరికల్ స్టడీ ఆఫ్ హైబ్రీడ్ ఎన్‌క్రిప్షన్ యూసింగ్ సిమ్మెట్రిక్, అసెమ్మెట్రిక్ అండ్ హాషింగ్ అల్గారిథమ్స్’ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించగా ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శివానందలహరిరెడ్డి మాట్లాడుతూ ఈ పరిశోధన ద్వారా ముఖ్యమైన సమాచారాన్ని సైబర్ నేరస్తులు దొంగలించకుండా సురక్షితంగా ఉంచి సమాచారం గోప్యత, సమగ్రతను కాపాడే ఓ దృఢమైన వ్యవస్థ అని అన్నారు.

ప్రతి వ్యక్తి ధర్మం ఆచరించాలి

బ్రహ్మంగారిమఠం : ప్రతి వ్యక్తి ధర్మం ఆచరించాలని చాపాటి సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చౌదరవారిపల్లెలో తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార పరిషత్ కడప వారి ఆధ్వర్యంలో రామాయణం అనే అంశంపై ఆయన ప్రవచించారు. రాముడు ధర్మస్వరూపుడు, సద్గుణ సంపన్నుడు, ఆదర్శ పురుషుడు అని తెలిపారు. రామతత్వాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, ఎల్.కొండారెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, ఎ.రామసుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100 పాలిసెట్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మే 10న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తారని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామంలో మంగళవారం జిల్లా నీటియాజమాన్య సంస్థ, వాటర్‌షెడ్ సహకారంతో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి భారతి మాట్లాడుతూ వేసవి కాలంలో పశువులకు సోకే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ శిబిరంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. అలాగే పాడి పశువులకు, ఎద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశు పోషకులకు నట్టల నివారణా మందులను పంపిణీ చేసి వాటిని తాపించాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ పీఓ రఘునాథరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఆంజనేయరెడ్డి, టీఓ చలపతి, తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని ఎన్.పాలగిరి గ్రామంలో మంగళవారం నీటి యాజమాన్య సంస్థ కడప వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని గొర్రె కాపరులే కాకుండా పాడి రైతులు తమ పశువులను వైద్య శిబిరానికి తీసుకువచ్చారు. మండల పశు వైద్యాధికారులు సునీల్‌కుమార్‌రెడ్డి, సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో పాల్గొన్న పాడి రైతులు, గొర్రెల కాపరులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశు పోషణ యొక్క ఆవశ్యకత గురించి వైద్యాధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో నీటి యాజమాన్య సంస్థ పీఓ మద్దిలేటి, వాటర్‌షెడ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి భారతి, తదితరులు

మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

కడప ఎడ్యుకేషన్: మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం అని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ యస్. కవిత అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ‘మహిళల అక్రమ రవాణా– మాదక ద్రవ్యాల వినియోగం’ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని చట్టాలొచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉందన్నారు. వెట్టిచాకిరి, లైగింక అవసరాల కోసం పురుషులు, మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారన్నారు. మహిళలు ఇటువంటి వారి గురించి అవగాహ కలిగి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం వలన యువత భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మారుస్తుందన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా వెనకాడరన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా, వీటి చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు, స్టెప్, క్రీడా సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ యస్.కవిత

పలుకుబడి లేకుండానే పథకాలు

ప్రొద్దుటూరు : ఎవరి పలుకుబడి అవసరం లేకుండానే ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తాను ప్రాతినిథ్యం వహిస్తున్న 27వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తెలపాలని కోరారు.